క్లుప్తంగా

ఉత్తమ ఫార్మాసిస్ట్‌గా సంజీవ్



మోర్తాడ్: బాల్కొండ నియోజకవర్గంలో ఉత్తమ ఫార్మాసిస్ట్‌గా ఎంపికైన ముక్క సంజీవ్‌కు అవార్డును ఎంపీపీ శివలింగు శ్రీనివాస్, సర్పంచ్ భోగ ధరణిలు అందించారు. దశాబ్ది సంబరాల్లో భాగంగా మోర్తాడ్‌లో తెలంగాణ వైద్య ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. వైద్య సేవలు అందించడంలో కృషి చేసిన సంజీవ్‌ను ఉత్తమ ఫార్మాసిస్ట్‌గా ఎంపిక చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రమేశ్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ అశోక్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్ దొన్కల్ సంజీవరెడ్డి, జెడ్పీటీసీ బద్దం రవి పాల్గొన్నారు.

బాస్కెట్ల పంపిణీ

మాక్లూర్: మాదాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బుధవారం స్థానిక అంబేడ్కర్ సంఘం సభ్యులు ఎంఈవో రాజ్‌గంగారెడ్డి ఆధ్వర్యంలో బాస్కెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు అరుణ్, రమేష్, సురేష్, భాస్కర్, కిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శెట్‌పల్లి విద్యార్థికి రజత పతకం



మోర్తాడ్: జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో మండలంలోని శెట్‌పల్లికి చెందిన మాదం సుశాంత్ రజత పతకం సాధించాడు. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపూర్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో సుశాంత్ ప్రతిభ కనబరచగా రజత పతకం దక్కించుకున్నాడు. జాతీయ స్థాయి పోటీల్లో రాణించిన సుశాంత్‌ను గ్రామస్తులు అభినందించారు.

యూనియన్లను పునరుద్ధరించాలి

ఆర్మూర్: తెలంగాణ ప్రభుత్వం స్పందించి ఆర్టీసీలో యూనియన్లను పునరుద్ధరించాలని ఎంప్లాయీస్ యూనియన్ డిపో నాయకుడు అర్గుల్ రమేశ్ కోరారు. ఆర్మూర్ ఆర్టీసీ డిపో ప్రాంగణం ఎదుట ఎంప్లాయీస్ యూనియన్ 9వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నేత హనుమాండ్లు జెండాను ఆవిష్కరించిన అనంతరం అర్గుల్ రమేశ్ మాట్లాడారు. కార్యక్రమంలో సీసీఎస్ ప్రసాద్, గోపి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ పదవి నుంచి తొలగించాలి

బోధన్: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను పదవి నుంచి తొలగించాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు శ్రావణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పట్టణ కేంద్రంలోని ఆర్డీవో ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్ హుస్సేన్‌కు వినతి పత్రం అందించారు. ఈ విషయమై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం సరైంది కాదని పేర్కొన్నారు. నాయకులు సురేష్, సందీప్, కిరణ్, పోశెట్టి, సాయిలు పాల్గొన్నారు.

'వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలి'

వేల్పూర్: కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీలు ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు విస్మరించి, మోసగించాయని, వారి మోసాలను గుర్తించి వచ్చే ఎన్నిల్లో గుణపాఠం చెప్పాలని ప్రభుత్వ మాజీ విప్ ఈరవత్రి అనిల్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డిలు పిలుపునిచ్చారు. వేల్పూర్ మండలం అమీనాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు చంద్రశేఖర్‌గౌడ్ వారి ఆధ్వర్యంలో బుధవారం వేల్పూర్‌లో కాంగ్రెస్‌లో చేరారు. ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు. జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీరడి భాగ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు సన్మానం



పెర్కిట్(ఆర్మూర్): బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమితులైన పెర్కిట్‌కు చెందిన జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు పెద్దోళ్ల గంగారెడ్డి, ఆర్మూర్ నియోజకవర్గ నాయకులు పొద్దుటూరి వినయ్ రెడ్డిని ఆ పార్టీ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు.

బోధన్‌లో..



బోధన్: పట్టణంలోని శక్కర్‌నగర్‌కు చెందిన న్యాయవాది అడ్లూరి శ్రీనివాస్ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమితులైన సందర్భంగా బుధవారం స్థానిక కోర్టు వద్ద న్యాయవాదులు సన్మానించారు. భవిష్యత్తుల్లో ఉన్నత పదవులు పొంది ఈ ప్రాంతానికి పేరు ప్రతిష్టలు తేవాలని న్యాయవాదులు పేర్కొన్నారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా

- రాత్రి, పగలూ తేడా లేకుండా సాగుతున్న దందా
- పెద్ద వాగు నుంచి పాత వే బిల్లులు చూపుతూ ఇసుక తరలింపు



ఉప్లూర్‌కు చెందిన వ్యక్తి పేరుతో తీసుకున్న వేబిల్లు



ముప్కాల్ మండలం రెంజర్ల మీదుగా తరలిస్తున్న ఇసుక

బాల్కొండ: ఇసుక అక్రమ రవాణా మూడు టిప్పర్లు.. ఆరు ట్రాక్టర్లుగా సాగుతోంది. ఇసుక అనుమతి కోసం తహసీల్దార్ వద్ద ఒక గ్రామానికి చెందిన వ్యక్తుల కోసం, ప్రభుత్వ నిర్మాణాల కోసం అనుమతులు పొందుతూ ఇతర ప్రాంతాలకు ప్రయివేటు నిర్మాణాలకు దర్జాగా విక్రయిస్తున్నారు. మోర్తాడ్ మండలం సుంకెట్ గ్రామ శివారులో పెద్ద వాగు నుంచి ఇసుకను తరలించటానికి పాత తేదీల్లో జారీ చేసిన వే బిల్లులను చూపుతూ ఇసుకను తరలిస్తున్నారు. అధికారులు అనుమతుల వరకే తమ పని ఇసుక ఎటు తరలించుకున్న తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో పగలు, రాత్రి అని లేకుండా నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్నారు. అనుమతులిచ్చిన అధికారులు ఇసుక తరలింపుపై పర్యవేక్షణ లేకపోవడంతో ఇసుక పక్కదారి పడుతోంది.

వే బిల్లుల్లో తేదీలు మార్చి..

ప్రభుత్వ నిర్మాణాల కోసం తహసీల్ కార్యాలయం నుంచి అనుమతులు పొందుతున్నారు. అలా పొందిన అనుమతి పత్రంపై తేదీలను మార్చి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అంతే కాకుండా ఈ నెల 9న ఇసుక తరలించుటకు అనుమతి తీసుకున్న వే బిల్లుల ద్వారానే బుధవారం కూడా ఇసుకను తరలిస్తున్నారు. అది రాత్రి వేళల్లో కూడా తరలిస్తున్నారు. తప్పుడు వే బిల్లులు చూపడంతో పాటు హైటెక్ విధానంలో ఇసుకను తోడేస్తున్నారు. ఎక్కడికో అనుమతులు తీసుకుంటూ మరెక్కడికో ఇసుకను తరలిస్తున్నారు. కమ్మర్‌పల్లి మండలం అనుమతి తీసుకొని ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామానికి తరలిస్తున్నారు. అంతా తప్పుడు వే బిల్లులు, తప్పుడు ఇసుక దందా సాగిస్తున్నారు. అసలు ఇసుక ఎటు పోతుందో కూడా అధికారులు పట్టించుకోవడం లేదనడానికి నిదర్శనం ఇదే. కొందరు వ్యాపారులు ఇసుకను పక్క దారి పట్టించడం వలన అసలు అవసరం ఉన్న భవనాలకు ఇసుక దొరక్కుండా పోతోంది. ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ దందాకు చెక్ పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వాస్పత్రులు

- ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి



ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఆర్మూర్ : ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రులు కార్పొరేట్ ఆస్పత్రులకు ఏ మాత్రం తీసిపోని విధంగా సేవలు అందిస్తున్నాయని పీయూసీ చైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆర్మూర్ నియోజకవర్గ స్థాయి వైద్య, ఆరోగ్య దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ముఖ్య అతిథిగా ప్రసంగించారు. బస్తీ దవాఖానాల స్ఫూర్తితో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లో మరింత మెరుగైన వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా మూడు వేలకు పైగా పల్లె దవాఖానాలను ఏర్పాటు చేయడం సీఎం కేసీఆర్ దూరదృష్టికి నిదర్శనమన్నారు. అనంతరం ఆస్పత్రిలో పురుడు పోసుకున్న బాలింతలకు కేసీఆర్ కిట్లను, గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లను అందజేశారు. ఉత్తమ సేవలను అందిస్తున్న పలువురు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగరాజు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను మించిన నాయకులు లేరు

మాక్లూర్: కేసీఆర్‌ను మించిన నేతలు దేశంలో మరెక్కడా లేరని ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు. నమస్తే నవనాథపురం కార్యక్రమంలో భాగంగా బుధవారం గొట్టిముక్కలలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మాట్లాడారు. భవిష్యత్తులో బీఆర్‌ఎస్‌కు ఓట్లేసి కేసీఆర్‌ను ఈ దేశానికి ప్రధాన మంత్రిని చేయాలన్నారు. అనంతరం గ్రామంలో గల్లీలవారిగా తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుని కమ్యూనిటీహాల్, రామాలయం నిర్మాణాలకు భూమి పూజ చేశారు.

జీవితమంతా అండగా నిలుస్తా

పెర్కిట్(ఆర్మూర్): మళ్లీ గెలిచి జీవితాంతం ప్రజలకు అండగా నిలుస్తానని ఎమ్మెల్యే జీవన్ రెడ్డి భరోసా కల్పించారు. ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మాక్లూర్ మండలం రాంచంద్రపల్లి గ్రామానికి చెందిన యాదవ, కురుమ సంఘాల సభ్యులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ కండూవాతో పార్టీలోకి ఆహ్వానించారు.

ప్రభుత్వాస్పత్రి అధ్వానంగా తయారైంది



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత కొల వెంకటేశ్

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ ప్రభుత్వాస్పత్రి అధ్వానంగా తయారైందని కాంగ్రెస్ నేత కొల వెంకటేష్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలో బీఆర్‌ఎస్ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య దినోత్సవంపై కాంగ్రెస్ నేత కొల వెంకటేశ్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆర్మూర్ ప్రజల ఆరోగ్యానికి ఏ వైద్య సదుపాయాలు కల్పించారని ఉత్సవాలు జరుపుకుంటున్నారని ప్రశ్నించారు. కొద్ది రోజుల క్రితం 100 పడకల ఆస్పత్రిగా మారుస్తూ వైద్య విధాన పరిషత్‌లో చేర్చారు. అయినా 30 పడకల ఆస్పత్రి కంటే అధ్వానంగా ఉందన్నారు. 44 మంది డాక్టర్లు ఉండాల్సిన చోట 12 మంది, 40కి పైగా నర్సులు ఉండాల్సిన చోట 15 లోపు మాత్రమే ఉన్నారని అన్నారు. ల్యాబ్ టెక్నీషియన్, రేడియోగ్రాఫర్, థియేటర్ అసిస్టెంట్, డార్క్ రూమ్ అసిస్టెంట్, ఫార్మసిస్ట్, తదితర పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. రక్త నిల్వ సదుపాయం కూడా లేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేసిందన్నారు. నాయకులు మీర్ మాజీద్, అజ్జు, జిమ్మి రవి, మందుల పోశెట్టి, బాలకిషన్ పాల్గొన్నారు.

బస్‌పాసులకు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలి



ఆర్మూర్‌టౌన్: పాఠశాల, కళాశాల విద్యార్థులు ఇక నుంచి బస్‌పాసుల కోసం ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలని డిపో మేనేజర్ కవిత అన్నారు. ఆర్మూర్ డిపో కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. డిపో పరిధిలోని స్కూల్, కాలేజీ విద్యార్థులు బస్ పాస్ దరఖాస్తులకు కోసం ఆర్టీసీ అధికారిక వెబ్‌సైట్ https://online.tsrtcpass.inలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 12 ఏళ్ల లోపు బాలురకు, 18 ఏళ్లలోపు బాలికలకు ఉచిత బస్సు పాస్ సౌకర్యం కల్పిస్తుందన్నారు. స్కూల్ పిల్లలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా స్కూళ్లలో కౌంటర్లు ఓపెన్ చేసి బస్ పాస్ సౌకర్యం కల్పిస్తామన్నారు.

హీరో ప్యాషన్ ప్లస్ బైక్ ఆవిష్కరణ



బోధన్/బోధన్ టౌన్: పట్టణ కేంద్రంలోని శివ మోటార్స్ హీరో షోరూంలో బుధవారం హీరో ప్యాషన్ ప్లస్ బైక్‌ను బోధన్ ఆర్డీవో రాజేశ్వర్, ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయ్‌ల చేతుల మీదుగా ఆవిష్కరించారు. మోటర్ బైక్ ప్రత్యేకతలను షోరూం యాజమానులు ఇందూర్ చంద్రశేఖర్, సునీత వివరించారు. డిజిటల్ మీటర్, మంచి మైలేజ్, మొబైల్ చార్జింగ్ పాయింట్ బైక్ ప్రత్యేకతలని వివరించారు. ఏకచక్రేశ్వరాలయం చైర్మన్ బీర్కూర్ శంకర్, నాయకులు భవానీపేట శ్రీను, యూనుస్ పాల్గొన్నారు.

'వైద్య సేవల్లో గుణాత్మక మార్పులొచ్చాయ్'



బోధన్‌లో న్యూట్రిషన్ కిట్ అందజేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది, అధికారులు



మోర్తాడ్‌లో మాట్లాడుతున్న డాక్టర్ రమేశ్

బోధన్‌టౌన్(బోధన్): తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం వైద్య సేవల్లో గుణాత్మకమై మార్పులు వచ్చాయని, ఇందులో భాగంగానే బోధన్‌లోని ఏరియా ఆస్పత్రిని జిల్లా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేశారని ఆర్డీవో రాజేశ్వర్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బోధన్‌లో బుధవారం వైద్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అతిథిగా ఆర్డీవో రాజేశ్వర్ హాజరై మాట్లాడారు. తెలంగాణ సీఎం కేసీఆర్ గర్భిణులను దృష్టిలో ఉంచుకొని ఆడబిడ్డ పుడితే రూ.13 వేలు, మగబిడ్డ పుడితే రూ.12 వేల పేరుతో కేసీఆర్ కిట్ పథకాన్ని అమలు చేస్తున్నారని, ఈ కిట్‌ను ప్రారంభించిన నాటి నుంచి నియోజక వర్గంలో 9,842 మందికి అందించారని తెలిపారు. దీంతో పాటు రూ.9 కోట్ల 74 లక్షల 15 వేలు వారి ఖాతాల్లో జమ చేశామని వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మేరుగైన వైద్య సేవలు అందించడానికి పలు చోట్ల పల్లె, బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కేసీఆర్ పాలనలో మెరుగుపడిన వైద్య సేవల గురించి వివరించారు.

వైద్య సేవల గుర్తింపు

రోగులకు ఉత్తమ సేవలను అందించిన వైద్యులు, వైద్య సిబ్బంది, ఆశాలను గుర్తించి ప్రశంసా పత్రాలు, మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి అయేషా ఫాతిమా, డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ శివ శంకర్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, ఎంపీపీలు బుద్దె సావిత్రి, శ్రీనివాస్, ఏఎమ్‌సీ చైర్మన్ వీఆర్ దేశాయ్ పాల్గొన్నారు.

వైద్య సేవలు మెరుగయ్యాయి

మోర్తాడ్: తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తరువాత వైద్య సేవలు మెరుగయ్యాయని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రమేశ్ అన్నారు. బుధవారం మోర్తాడ్‌లో తెలంగాణ వైద్య ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి ఆయన మాట్లాడారు. కంటి వెలుగు ద్వారా ఎంతో మంది మెరుగైన వైద్యం అందించామన్నారు. కరోనా సమయంలోను ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు సేవలు అందించడంతో మరణాల సంఖ్య తగ్గిందన్నారు. డీసీవో, నియోజకవర్గం నోడల్ అధికారి సింహాచలం, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అశోక్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్ దొన్కల్ సంజీవరెడ్డి, ఎంపీపీ శ్రీనివాస్, జడ్పీటీసీ సభ్యుడు బద్దం రవి, సర్పంచ్ భోగ ధరణి పాల్గొన్నారు.



అద్దె కాడెడ్లతో ఎవుసం

యాంత్రీకరణతో వ్యవసాయం చేస్తున్న రోజులివి. పొలాలను దుక్కి దున్నడానికి నూటికి 99 శాతం మంది రైతులు ట్రాక్టర్లనే వినియోగిస్తున్నారు. కానీ, దొంకేశ్వర్ మండలం మారంపల్లికి చెందిన యువరైతు రాజేశ్వర్ మాత్రం పాత పద్ధతిలోనే ఎవుసం చేస్తున్నారు. అది కూడా సొంత ఎడ్లు లేకపోవడంతో పక్క ఊరి నుంచి వీటిని అద్దెకు తెచ్చుకున్నారు. ఎకరం పొలాన్ని ఎడ్ల సాయంతోనే దున్ని పసుపు విత్తనాలు వేశారు. ఎడ్లకు ఒక్క రోజుకు రూ.3 వేల అద్దెను చెల్లించారు. ప్రతీ ఏటా ఎడ్లను అద్దెకు తీసుకుని సాగు చేస్తున్నట్లు యువరైతు రాజేశ్వర్ 'సాక్షి'తో పేర్కొన్నారు.

దొంకేశ్వర్(ఆర్మూర్)

గోవులను వధిస్తే ఆందోళనలు చేస్తాం



ఆర్మూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న సభ్యులు

ఆర్మూర్‌టౌన్: ఏకాదశి రోజున బక్రీద్ పేరిట గోవులను వధిస్తే ఆందోళన చేస్తామని గో సేవా జిల్లా ప్రముఖ్ పాండు రంగారావు హెచ్చరించారు. ఆర్మూర్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం గోసేవా– గో సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో గోవధకు వ్యతిరేకంగా ఎస్సై రాములుకు ఫిర్యాదు చేశారు. రంగారావు మాట్లాడుతూ.. ఈనెల 29న బక్రీద్ పండుగ వస్తుందని, ఆర్మూర్ పట్టణంతో పాటు వివిధ గ్రామాలకు గోవులను అక్రమంగా తరలించకుండా పోలీసులు శాఖ నిఘా వేసి తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. గోమాతను రక్షించాలని కోరారు. బీజేపీ ఆర్మూర్ పట్టణ అధ్యక్షుడు జెస్సు అనిల్ కుమార్, నందిపేట ఖండ గో సేవా ప్రముఖ్ బద్గుణ వంశీ కుమార్, గో సేవ ప్రముఖ్ మేకల లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



మాక్లూర్: వెంకటాపూర్‌లో నూతనంగా నిర్మించిన దాసాంజనేయ ఆలయంలో బుధవారం ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం జరిగింది. సర్పంచ్ పుల్లయ్యగారి భవాని రఘు, ఆలయ కమిటీ చైర్మన్ పుల్లయ్యగారి జలపతిరావ్, గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావులు హాజరయ్యారు. ప్రత్యేక పూజలు చేసి విగ్రహ మూర్తులను ప్రతిష్ఠించారు. అనంతరం ఆలయంపై శిఖర ప్రతిష్ఠాపన చేశారు. ఎంపీపీ ప్రభాకర్, ఎంపీడీవో క్రాంతి పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలి



రైతులతో మాట్లాడుతున్న ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్ కుమార్

భీమ్‌గల్: వరి ధాన్యం కొనుగోళ్లలో మోసపోయిన రైతులకు న్యాయం చేయాలని ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్ కుమార్ వ్యాఖ్యానించారు. బెజ్జోరలో వరి ధాన్యం కుప్పలను ఆయన బుధవారం పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు జరుగుతున్నాయంటూ రైతులు ముత్యాల సునీల్‌తో ఆవేదన వెళ్లిబుచ్చుకున్నారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లలో రూ.వేల కోట్ల దోపిడీ జరిగిందని, 40 కిలోల సంచికి 6 కిలోల తరుగు తీస్తూ రైతుల కష్టం దోచుకుంటున్నారని విమర్శించారు. పంట కోత కోసి మూడు నెలలు అవుతున్నా ఇప్పటి వరకు వడ్లను కొనకపోవడం మంత్రి అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు.

సమాచారం..

నేడు ఎమ్మెల్యే షకీల్ పర్యటన

బోధన్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పల్లె ప్రగతి దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆమేర్ గురువారం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు నూతనంగా నిర్మించిన రెడ్డికా సంఘం భవనాన్ని ప్రారంభించనున్నారు. 10 గంటలకు రెంజల్ మండలంలోని సాటాపూర్‌లోని సమియా గార్డెన్‌లో నిర్వహించనున్న పల్లెప్రగతి దినోత్సవ కార్యక్రమాలో పాల్గొని కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణి చేయనున్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు ఎమ్మెల్యే క్యాంపస్ ఆఫీసులో కుట్టుమిషన్లను పంపిణీ చేస్తారు.

రేపు బోధన్‌లో శివసేన జిల్లా స్థాయి సమావేశం

బోధన్: శివసేన పార్టీ జిల్లా స్థాయి కార్యకర్తల సమావేశం ఈ నెల 16న బోధన్ పట్టణ శివారులోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్నామని, తమ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శింకారు శివాజీ ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గోపి కిషన్ తెలిపారు. బుధవారం పట్టణ కేంద్రంలో స్థానిక నాయకులతో కలిసి మాట్లాడారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు పట్టణ శివారులోని ఆచన్‌పల్లి కమాన్ వద్ద రాష్ట్ర అధ్యక్షుడికి స్వాగతం పలికి అక్కడి నుంచి ర్యాలీగా బయలుదేరుతామని వెల్లడించారు. నాయకులు పాండవుల భూమేష్, ప్రీతం, ఏనుగంటి గౌతం, పడాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

16న సాధారణ సర్వ సభ్య సమావేశం

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 16న ఎంపీపీ పస్క నర్సయ్య అధ్యక్షతన సాధారణ సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ బుధవారం తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సకాలంలో హాజరు కావాలని ఈ సందర్భంగా ఎంపీడీవో కోరారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	స్పైడర్‌మాన్ అక్రాస్ (తెలుగు) 1.00 ఇంటింటి రామాయణం – 4.05 టక్కర్ – 7.00 ; పరేషాన్ 10.00
స్క్రీన్-2 –	ట్రాన్స్‌ఫార్మర్స్ (3డి-తెలుగు) – 11.15, 3.10, 6.05, 9.00
స్క్రీన్-3 –	అన్‌స్టాపబుల్(తెలుగు) 12.50, 6.35 మేమ్ ఫేమస్ – 3.25, 9.10
స్క్రీన్-4 –	ది ఫ్లాష్ (తెలుగు) 10.00, 1.10, 4.20, 7.30, 10.40

సంక్షిప్తం

అవినీతిపై విచారణ జరిపించండి

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్‌లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై జిల్లా కలెక్టర్ స్పందించి విచారణ జరపాలని బీజేపీ ఫ్లోర్ లీడర్ జీవీ నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. ఈ నెల 9న జరిగిన సర్వసభ్య సమావేశంలో 69 అంశాలు ఏక కాలంలో ఆమోదించిన విషయాన్ని పత్రికల్లో వచ్చినా కలెక్టర్ విచారణ జరపకపోవడం విచారకరమన్నారు. ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఆర్మూర్ మున్సిపల్‌లో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరపాలన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు

బాల్కొండ: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బాల్కొండ ఎమ్మార్సీ కార్యాలయం వద్ద బుధవారం నియోజకవర్గ స్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. తెలంగాణ అభివృద్ధి అనే అంశంపై పోటీలు పెట్టగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎంఈవో రాజేశ్వర్ పాల్గొన్నారు.

దొంకేశ్వర్‌లో పర్యటించిన బీజేపీ నేత రాకేశ్ రెడ్డి

దొంకేశ్వర్(ఆర్మూర్): బీజేపీ నాయకులు రాకేశ్ రెడ్డి బుధవారం దొంకేశ్వర్ మండలంలో పర్యటించారు. గంగాసముందర్‌లో గృహ ప్రవేశానికి హాజయ్యారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు మారంపల్లి గంగాధర్‌ను పరామర్శించారు.

అక్రమ నిర్మాణ పనులు నిలిపివేయాలి

ఆర్మూర్‌టౌన్: పెర్కిట్ విద్యానగర్ కాలనీలో అక్రమ నిర్మాణ పనులు నిలిపి వేయాలని స్థానికుడు బి.నాగేంధర్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. కాలనీలో రోడ్డును ఆక్రమిస్తూ నిర్మాణం చేయడం వల్ల భవిష్యత్తులో స్థానికుల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతాయని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు.

జేడీపీకి ఘన నివాళులు

పెర్కిట్(ఆర్మూర్): ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మాజీ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పొద్దుటూరి రవీందర్ రెడ్డికి బుధవారం కొటార్మూర్‌లో కుటుంబ సభ్యులు ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన జ్ఞాపకార్థం గ్రామంలో అన్నదానం చేశారు. కుటుంబ సభ్యులు నిఖిత, లిఖిత, బద్దం రాజు రెడ్డి, కుంట వినయ్ రెడ్డి, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఉప సర్పంచ్ బండమీది గంగాధర్, ఎంపీటీసీ యాల్ల రాజ్ కుమార్, సొసైటీ చైర్మన్ బంటు మహిపాల్, వీడీసీ అధ్యక్షుడు లింగా రెడ్డి పాల్గొన్నారు.

మహిళల భద్రతకు షీటీం అండగా ఉంటుంది

ఆర్మూర్‌టౌన్: మహిళల భద్రతకు షీటీం ఎప్పుడూ అండగా ఉంటుందని షీటీం ఎస్సై ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని గురుకుల డిగ్రీ కళాశాలలో దశాబ్ది ఉత్సవాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా షీ టీం అధికారులు మహిళల రక్షణకు సంబంధించిన విషయాల గురించి తెలిపారు. అనంతరం షీటీం ఎస్సైను, సిబ్బందిని కళాశాల ప్రిన్సిపాల్ ధనవేణి సన్మానించారు.